# ఈవారం కథ



# దేశభక్తుడు

కపిల

వీధి మలుపు దగ్గర వినబడిందో కేక.

"ఆగక్కడ ఎవర్నువ్వు"

కొన్ని క్షణాల క్రితం వరకు తనకో తోడుంది. వొక లక్ష్యమూ వుంది. ఉన్నట్టుండి సహచరి బాధలతో గాయాలతో కనుమాటు చేసింది. ఇప్పుడు తానెవ్వరు.

" నిన్నే అడుగుతోంది. ఎవర్నువ్వు"

ఇప్పుడే మొలకెత్తిన మొక్కనా. ఇప్పుడే ప్రభవించిన పక్షినా- క్రితం వరకు తనతో వున్న తన జీవితం ఇప్పటి తన ప్రశ్నకు పునాదే కదా!

'వూరికి కొత్తవాడివా'

ఇప్పుడు తానొక కొత్తవాడిగా వున్నాడా- తన గతం తనతో లేదా-

"ఏయ్ మాట్లాడవేం"

అర్థంలేని నవ్వొకటి.

" ఎక్కడికెళ్ళాలి నువ్వు"

ఎక్కడికెళ్ళాలి తను. ముందుకేనా.

" పద నేనూ నీదార్లోనే. నా జీపెక్కు డ్రాప్ చేస్తా"

ఎవరితడు తనదీ అదారే నంటున్నాడు.

జీపు కదిలింది. జీపు నడుపుతున్న వ్యక్తి లావుగా వున్నాడు. మీసాలు మెలి తిరిగి వున్నాయి. అతడి లావు బలంగానే వున్నట్లుంది.

"దేశం రానూరానూ అరాచకమైపోయింది. ఇలా చూడు భయమూ, భక్తీ లేకుండా బస్సులో ఇరవై నలుగుర్ని సజీవ దహనం చేశారు వాళ్ళు. వాళ్లపై శిక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలిక్కడ"

శిక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలు –

"చూడు మానవుల్లో ఎంత హింసా ప్రవృత్తి పెరుగుతోందో- ఇప్పటి తరానికి పూర్తిగా భయమూ భక్తీ లుప్తమవుతున్నాయి. ఎంత మెకానికల్‌గా తయారువుతున్నారు వీళ్ళు"

పరుగు పరుగు పరుగు – ఎవరి జీవితాన్ని వాళ్ళందుకోడానికి వొకటే పరుగు. ఇప్పటి తరం నిజంగా మనుషులేనా. ఉత్పత్తినీ అవసరాన్ని పెంచే యంత్రాలేనా –

"వెనకటి తరం ఎంత పదునుగా ఉండేది? ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జె.పి.గొంతే తీసుకో. ఎంతమంది యువకులు ప్రభావితమయ్యారు. అంతెందుకు యువతను కదిలించే ఎన్ని ఉద్యమాలను మేం చూడలేదు. ఏమవుతుంది ఇప్పడంతా. దేశభక్తీ, జాతీయ సమైఖ్యతా భావాలే లుప్తమవుతున్నాయి గదా"

ఆకలితో వున్న వాడిక్కావాల్సింది అన్నమే కాని వేదాంతం కాదంది ఎవరు వివేకానందుడేనా –

"నీ మొహం చూస్తుంటే నువ్వూ దేశభక్తుడి లాగే వున్నావ్. చదువుకున్నావా?

చిరునవ్వే సమాధానం.

దేశభక్తి – అవును దేశభక్తే. దేశమంటే మట్టి పుట్టలూ ఎల్లలూ మాత్రమే కాదు. దేశమంటే ప్రజలు – నాదేశం ప్రజల్లో అరవై శాతం అర్థాకలితో.వున్నారు. వార్దందరి అవసరం దేశభక్తి ప్రబోధమా –

" నేను జాతీయవాదిని మతం పేరుతో కులం పేరుతో జాతి పేరుతో ఈ దేశం విఛ్ఛిన్నం కావడాన్ని నేను సహించను' '

ఒక జాతిని మరొక్కజాతీ – మహాకవీ – ఎవరి గురించి వాళ్ళు తెలుసుకోవడం–

" దేశం మొత్తం మీద హింసావాదం పెరిగిపోయింది. అస్సాం, కాశ్మీర్, పంజాబ్, బీహార్, ఆంధ్రా– దేశాన్ని విఛ్ఛిన్నం చేసే కుట్రలు జరుగుతున్నై. ఒక దేశభక్తుడిగా నాగొంతులో ప్రాణమున్నంతవరకు వీటిని ఎదిరిస్తూనే వుంటాను."

"నాకొక తుపాకి కావాలి"

"ఏమిటీ నువ్వూ నాతో చేయి కలుపుతావా. భలే! మనదేశ రక్షణకు మనం సిద్ధం కావడం ఎంతైనా అవసరం. దేశభక్తుడా వెల్‌కం–"

చిర్నవ్వే సమాధానం.

నా సహచరి లేనిలోటు తీరాలి. నామార్గం సుగమం కావాలి. నా లక్ష్యాన్ని చేరుకునే దారి కావాలి.

" నీకు తుపాకి నేనిస్తాను. నీకు కావల్సిన తుపాకి తీసుకో– ఈ దేశాన్ని వేర్పాటు వాదుల నుంచి, తీవ్రవాదుల నుంచి, ఉగ్రవాదుల నుండి కాపాడ్డానికి మనలాంటి కొన్ని లక్షల మంది పనిచేస్తున్నారు. అవసరమైనప్పుడంతా ఇంక ఈ భూమ్మీద తీవ్రవాదులు పుట్టే వీల్లేకుండా చేస్తున్నారు."

తిరిగి వస్తాను. లక్షోపలక్షలై తిరిగి వస్తాను–

"నన్నడిగితే వాళ్ళనే కాదు, వాళ్ళకు మద్ధతిస్తున్న వాళ్ళనూ మసి చేయాలంటాను. ప్రశాంత జీవనానికి భంగం కలిగించే ఇలాంటి పరిస్థితులకు కారణమవుతున్నదీ వీళ్ళే."

ఈ జీపులో ఇంకా ఎంత ప్రయాణం? ఆపడా–

"దేశభక్తుడా దిగు దిగు ఇదే మా ఇల్లు"

ధృడకాయుల పహారాలో ఒక భవనం. ఇతడెవరు. తన నెందుకిలా జీపులో మోసుకొచ్చాడు– దేశభక్తికి అర్థం చెప్పిన దేశభక్తుడా – ఎవర్నువ్వు

"రా మనదేశంలోని హింసావాదానికి తీవ్రవాదానికీ వ్యతిరేకంగా మనం పోరాడాలి. అందుకు సిద్ధంగా వుండాలి."

అతడి వెనక లోపలికి నడక.

ఒక పెద్ద సోఫాలో మునిగిపోయాడు.

గదిలోని గోడలనిండా యుద్ధ చిత్రాలు –

వేల సైనికుల కరవాల చలనాలతో – ఏనుగులూ గుర్రాలూ కాళ్ళ క్రింద పడి నలుగుతున్న దేహాలు–

ప్రతి వర్ణచిత్రమూ ప్రాణం తప్ప అన్నీవున్న ఓ మహా చిత్రం– యుద్ధాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన మానవులు యుద్ధాల్ని ప్రేమించే దిశలో వుండడం– బానిసత్వం లోంచి బానిసత్వంలోకి యుద్ధాలు– చాప్లిన్

చాప్లిన్– యుద్ధ ప్రభువులకు వ్యతిరేకంగా మనుషుల కోసం పోరాడితే మార్టిన్ లూథర్–

మహాశక్తుల పదఘట్టనల క్రింద నలుగుతున్న ప్రజలు వీళ్ళు.

యుద్ధమా యుద్ధమా– ప్రభు'త్వం' కోసం చేసేదెప్పుడూ బానిసత్వమే.

" రావోయ్‌రా నీ సహచరిని ఎంచుకుందువుగాని–"

సహచరి తన సహచరి లెఫ్ట్‌రైట్– లెఫ్ట్‌రైట్– లెఫ్ట్‌రైట్ ఎబౌటర్న్.

ఇంకో గది ముందున్నారిద్దరూ. ఆ గదిలోంచి కేకలు, కోలాహలం కేరింతలు, నవ్వులూ జీవితాల్ని తాగిన ఆనందపు మత్తును ప్రదర్శిస్తున్న గొంతులు.

గది తలుపులు తెరిచాడతడు.

గదిలో మనుషులెవ్వరూ లేరు.

విశాలమైన గదిలో అనేక టేబుళ్ళు. టేబుళ్ళనిండా రకరకాల తుపాకులు.

యువకుడు ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

కొన్ని తుపాకులు కన్నుగీటుతున్నాయి.

కొన్ని దర్పంగా మీసాలు దువ్వుతున్నాయి.

కొన్ని మహా రాజసాన్ని ఒలక బోస్తున్నాయి. ఆ మూలొక పిల్ల తుపాకి చిరునవ్వులు చిలుకుతోంది. అక్కడక్కడా ఒక్కో తుపాకి అతడిని నిర్లక్ష్యంగా చూస్తున్నాయి. మాతోడు కోసం వచ్చావా రా రమ్మంటున్నాయి.

"ఇందులోంచి నీక్కావల్సింది తీసుకో. అన్నీ బెస్ట్ మాడల్స్ ఎందరో దేశభక్తులు వీటిలో కొన్నింటిని ఉపయోగించారు. ఇందులో కొన్ని అస్సాంలో, బీహార్‌లో, కాశ్మీర్‌లో, ఆంధ్రలో కూడ మహా మహా గట్టివాళ్ళ అంతం జూశాయి. తీవ్రవాదాన్ని తగ్గించడంలో ఎంతో ఉత్సాహంగా పని చేస్తున్నాయి."

వాటి నోటి చివరళ్ళోని రక్తాల మరకలు ఆ విషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

ఓ మూల ఓ తుపాకి ఇతడికేసి అనుమానంగా చూస్తోంది. ఆఖరి క్షణంలో రక్తం వోడిన తన సహచరి వీటిలో ఏదీ– తన సహచరి తన జీవితంలో భాగమైంది. మరి వీటి సంగతో–

తోడుకోసం స్నేహం కోసం కాక తన మీద యాజమాన్యం కోసం తన దగ్గరి కొస్తున్న వాటిలా ఉన్నాయి ఇవి.

ఇంతవరకు ఆశయం ప్రాణంగా చెట్టాపట్టాలేసుకున్న జంటలోంచి వొకరు ఇవాళ బానిసత్వం కోసం ముందు కురుకుతారా?

క్రీగంట చూస్తున్న తుపాకులు హేళనగా నవ్వుతున్నట్టున్నాయి. మాతో పనిచేయగలవా అంటున్నట్టున్నాయి.

నో, దాని చేతిలోకి పోకూడదు. పోకూడదు.

వెను దిరిగాడు

వెనకాల అల్లరి ఎక్కువైంది.


అపహాస్యం– తిట్లు– శాపాలు.

వాడి చూపులు తన వెన్నులోంచి లోపలి కొస్తున్నట్లున్నాయి.

తన సహచరి ఇక్కడ లేదు– కోరలు తోమే పనివాడి కోసం ఎదురుచూస్తున్న యంత్రాలివి.

కొన్ని క్షణాలు– రోడ్డు మీదున్నాడు.

"దేశభక్తుడా ఆగు ఆగు" కేకలు వినిపిస్తున్నాయి.




వచ్చేవారం

సాజిద

హిందీకథ తెలుగుసేత: గఫార్